సాక్షి చిత్తూరు

ఆదివారం । 14 । జూలై । 2024



గ్రామాలు.. మురికి కూపాలు

పారిశుధ్య పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో గ్రామ పంచాయతీలు మురికికూపాలుగా మారాయి. - 8లో



నేలకూలిన మహా వృక్షం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మూడు శతాబ్దాల నాటి మహావృక్షం కూలి పడి ఆలయ శిఖరం ధ్వంసమైంది. - 8లో



ఎర్రచందనం స్వాధీనం

పుత్తూరు ఫారెస్ట్ రేంజ్‌లో రూ.3లక్షలు విలువ చేసే ఎర్రచందనాన్ని అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఆఫీస్ సబార్డినేట్ల కు యూనిఫాం పంపిణీ



యూనిఫాం అందజేస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆఫీస్ సబార్డినేట్లకు యూనిఫాంను డీఆర్‌ఓ పుల్లయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. కలెక్టరేట్‌లో శనివారం యూనిఫాం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు డీఆర్‌ఓ మాట్లాడుతూ జిల్లా రెవెన్యూ అసోసియేషన్ నాయకులు కలెక్టరేట్‌లోని 35 మంది ఆఫీస్ సబార్డినేట్లకు ఉచితంగా యూనిఫాం అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ హుస్సేన్, కలెక్టరేట్ ఏఓ పార్థసారథి, సభ్యులు హేమాద్రి రాజు, సంపత్, మధు, ఆఫీస్ సబార్డినేట్లు పాల్గొన్నారు.

ఆప్షనల్ సెలవుల ఖరారు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అన్ని యాజమాన్యాల బడులకు ఆప్షనల్ సెలవులను ఖరారు చేశారు. ఈ మేరకు శనివారం డీఈఓ కార్యాలయంలో అన్ని సంఘాల నాయకులతో డీఈఓ దేవరాజు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సర్కారు బడుల బలోపేతానికి నాయకులు కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ విద్యాసంవత్సరంలో ఆప్షనల్ సెలవులపై సంఘం నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 16వ తేదీన మొహర్రం, ఆగస్టు 16న వరలక్ష్మీ వ్రతం, నవంబర్ 15న కార్తీకదీపం, డిసెంబర్ 24న క్రిస్మస్, జనవరి 1న ఆంగ్ల నూతన సంవత్సరాదికి ఆప్షనల్ సెలవులు ప్రకటించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఆపస్, ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గంజాయ్!



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గంజాయి అక్రమ రవాణా చాపకింద నీరులా విస్తరిస్తోంది. గత నెల రోజులుగా విశాఖపట్నం నుంచి విచ్చలవిడిగా రవాణా అవుతోంది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో గంజాయి బాక్సులు దింపి యువతకు విక్రయించేలా స్మగ్లర్లు ప్లాన్ చేయడం పోలీసులను సైతం విస్మయానికి గురిచేస్తోంది. విద్యాసంస్థలే లక్ష్యంగా గుప్పు గుప్పుమంటూ గం'జాయ్' రాజ్యమేలడం తల్లిదండ్రులను సైతం ఆందోళనలో పడేస్తోంది. ఇటీవల వరుసగా పట్టుబడుతున్న ఘటనలు చూస్తే కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం తేటతెల్లమవుతోంది.

- వైజాగ్ టు బెంగళూరు వయా పలమనేరు
- ఎన్నడూ లేనంతగా పట్టుబడుతున్న గంజాయి
- పూతలపట్టు, రేణిగుంట నుంచి పట్టణాలు, నగరాలకు సరఫరా
- ఉమ్మడి జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గంజాయి రవాణా
- గంజాయి మత్తులో స్కూలు బస్సుపై దాడి.. భయాందోళనలో విద్యార్థినులు
- యథేచ్ఛగా తిరుపతికి సరఫరా అవుతున్న గంజాయి

సాక్షి టాస్క్‌ఫోర్స్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: విశాఖపట్నం నుంచి బెంగళూరు, చెన్నైకి గంజాయి అక్రమరవాణా విచ్చలవిడిగా సాగుతోంది. కర్ణాటక, తమిళనాడుకు తీసుకెళ్లే స్మగ్లర్లు మార్గమధ్యంలో ఉన్న తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో వాలిపోతున్నారు. వెళ్తూవెళ్తూ రైల్వేస్టేషన్లలో పరిస్థితిని చూసుకుని అక్కడక్కడా గంజాయిని తోటి స్మగ్లర్లకు అందించి కర్ణాటక, చెన్నైకి వెళ్తున్నట్లు పోలీసు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అలా శ్రీకాళహస్తి లేదా రేణిగుంట.. అక్కడ వీలుకాకపోతే తిరుపతి, పాకాలలో గంజాయిని దిగుమతి చేస్తున్నారు. అక్కడి నుంచి చిత్తూరు, పలమనేరులో ముందుగా ఏర్పాటు చేసుకున్న స్మగ్లర్లకు అందిస్తారు. ఆయా ప్రాంతాల్లో ఎక్కడా దిగుమతి చేసేందుకు వీలు కాకపోతే వెళ్తున్న రైల్లో నుంచి ముందుగా నిర్ణయించుకున్న నిర్మానుష్య ప్రాంతంలో గంజాయి బస్తాలు పడేస్తారు. అక్కడి నుంచి పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని బండపల్లికి చేరవేస్తారు. అక్కడి నుంచి గంజాయిని తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని పలు ప్రాంతాలకు సరఫరా అవుతున్నట్లు కొందరు చెబుతున్నారు.

గతంలో ఉక్కుపాదం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గంజాయి, మాదకద్రవ్యాలు, ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణాను నిరోధించేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ని ఏర్పాటు చేసింది. సెబ్, పోలీసులు వారి ఆటకట్టించేందుకు దృష్టి సారించారు. ఎక్కడికక్కడ వారిని కట్టడిచేస్తూ వచ్చారు. అందులో భాగంగానే విశాఖ నుంచి బెంగళూరు, చెన్నైకి గంజాయి తరలించే స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతూ వచ్చారు. అయితే గత కొద్ది రోజులుగా మళ్లీ గంజాయి రవాణా జోరందుకుంటోంది. దీనిపై పటిష్ట నిఘా లేకపోవడం.. సరైన సమాచారం అందించే నాథుడే లేకపోవడం గమనార్హం.



పోలీసులకు పట్టుబడిన గంజాయి

తిరుపతి జిల్లాలో పట్టుబడ్డ గంజాయి

సంవత్సరం	నమోదైన కేసులు	పట్టుబడ్డ గంజాయి	అరెస్టయిన వారు
2022	68	522 కిలోలు	219
2023	108	1207	491
2024 ఇప్పటి వరకు	33	170	107

నెల రోజుల వ్యవధిలో **32** కిలోల గంజాయి, **15** మందిని అరెస్టు చేశారు

గంజాయి కేంద్రాలు

చిత్తూరు జిల్లాలో : పలమనేరు, పూతలపట్టు, చిత్తూరు, మురకంబట్టు

తిరుపతి జిల్లాలో : పాకాల, చంద్రగిరి, తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి

గంజాయి లభ్యమయ్యే ప్రాంతాలు

రైల్వేస్టేషన్లు, బస్టాండ్ పరిసరాల్లో



స్వాధీనం చేసుకున్న గంజాయి

గంజాయి మత్తులో యువత చిత్తు

యువతను లక్ష్యంగా చేసుకుని స్మగ్లర్లు, విక్రయదారులు గంజాయిని స్నేహితుల ద్వారా వారికి రుచి చూపిస్తారు. మత్తుకు అలవాటు పడ్డ యువత వారి స్నేహితులకు గంజాయిని అలవాటు చేస్తున్నారు. అలా గంజాయికి అలవాటుపడ్డ విద్యార్థులు, అల్లరి చిల్లరగా తిరిగే యువత కొందరు మత్తులో గొడవలకు దిగుతున్నారు. ఇలాంటిదే ఇటీవల తిరుపతి మంగళం పరిధిలో చోటు చేసుకుంది. ఇద్దరు యువకులు గంజాయి మత్తులో ఓ ప్రైవేటు విద్యాసంస్థ బస్సుపై దాడికి తెగబడ్డారు. ఆ బస్సులో ఉన్న విద్యార్థినులు వారి చేష్టలను చూసి భయభ్రాంతులకు గురయ్యారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆ ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు.

చిత్తూరులో ఐదు దశాబ్దాలుగా ఓ ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయాల్లో ఆరితేరారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆ ఇద్దరూ చిత్తూరు నుంచి తిరుపతికి వచ్చి డబ్బు పంపిణీలో కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. డబ్బుతో పాటు యువతను గంజాయికి అలవాటు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం చిత్తూరు నుంచి తిరుపతికి వచ్చిన గ్యాంగ్ నగరంలో తిష్టవేసి గంజాయిని విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. తాజాగా చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలానికి గంజాయి సరఫరా పాకినట్లు విశ్వసనీయ సమాచారం. చిత్తూరు నుంచి వచ్చిన ఇద్దరు స్మగ్లర్లు తిరుపతి పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా గంజాయిని విక్రయిస్తూ.. యువతను మత్తుకు బానిసలుగా మారుస్తున్నట్లు పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గంజాయి మత్తులో పట్టుబడిన యువకులు



అద్దం ధ్వంసమైన స్కూల్ బస్సు

స్మగ్లర్ల ఆటకట్టిస్తాం

"గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘాపెట్టాం. ఎక్కడి నుంచి వస్తుంది, ఎక్కడెక్కడికి సరఫరా అవుతుందనే విషయాలపై దృష్టి పెట్టాం. గంజాయి ప్రధాన స్మగ్లర్లు, వారి నుంచి ఎవరెవరికి సరఫరా అవుతోందో తెలుసుకుంటున్నాం. ఇక వారందరి ఆటకట్టిస్తాం. ఇప్పటికే కొందరిని అరెస్టు చేసి కేసులు నమోదు చేశాం.

– రాజేంద్ర, అడిషనల్ ఎస్పీ, సెబ్, తిరుపతి జిల్లా


రామ్ స్ఫూర్తితో బషీర్

- పలమనేరు టు లడఖ్
- నెల రోజులపాటు సాగిన సైకిల్ యాత్ర
- జిల్లాలో తొలి సైకిల్ యాత్రికుడు
- ప్రకృతిని పరిరక్షించాలంటూ సందేశం



చేతిలో సరైన ఉద్యోగం లేదు. ఉపాధి కోసం దుకాణం పెడితే నడవలేదు. బెంగళూరుకెళ్లి చిరుద్యోగం చేస్తే ఆ వచ్చే సంపాదన సరిపోలేదు. సంతృప్తినివ్వలేదు.
కాస్త విరామం తీసుకుని సొంతూరికి వచ్చి అలా అడవి వైపు చూస్తూ నిలబడ్డాడు.
అడవిలో చాలా చెట్లు నరికివేతకు గురయ్యాయి. ప్రకృతిని కాపాడుకోవడానికి ఏదో ఒకటి చేద్దామనిపించింది.
చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌లో ట్రావెలర్స్ బ్లాగ్స్‌లో వీడియోలు చూస్తుంటే ఒక ఐడియా వచ్చింది. వెంటనే పాత సైకిల్ ఒకటి కొని, లడఖ్‌కు సైకిల్ యాత్ర ప్రారంభించాడు. జూన్ 12న మొదలైన యాత్ర జూలై 13న విజయవంతంగా ముగిసింది. నెల రోజుల తరువాత లడఖ్ చేరుకుని గెలుపు తీరాన్ని తాకాడు. సోషల్ మీడియాలో సెలబ్రిటీల జాబితాలో చేరిపోయాడు.
అతనే పలమనేరుకు చెందిన బషీర్.

పలమనేరు: నేటి యువత తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు ఆ యువకుడు. ప్రకృతిని కాపాడుకోవాలని, పర్యావరణాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఏదైనా కొత్తగా చేయాలనుకున్నాడు. మరో ఆలోచన చేయకుండా చేస్తున్న చిన్నపాటి ఉద్యోగానికి సెలవు పెట్టి ఇంట్లో వాళ్లకు నెల రోజులపాటు ట్రిప్ ఉందంటూ చెప్పి రెండు వేలు పెట్టి సైకిల్ కొని చేతిలో మూడువేలు పెట్టుకుని పలమనేరు నుంచి లడఖ్‌కు సైకిల్ తొక్కేశాడు. ఈ విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండడంతో జిల్లా వాసులు సైతం ఆశ్చర్యపోతున్నారు. సాధారణంగా బైక్‌లపై దూర ప్రాంతాలకు వెళ్లే ట్రావెలర్స్‌ను చూస్తుంటాం. రాష్ట్రంలో ముగ్గురు సైకిల్ యాత్రికులు ఉన్నారు. కానీ సైకిల్‌పై లడఖ్‌కు ఈ ప్రాంతం నుంచి వెళ్లింది బషీర్ ఒక్కడే కావడం గమనార్హం.



లడఖ్‌లో గమ్యస్థానం వద్ద బషీర్ విజయానందం

ఇదీ నేపథ్యం

పలమనేరు పట్టణానికి చెందిన మస్తాన్ బాషా కుమారుడు బషీర్(24) డిగ్రీ దాకా చదివి ఉద్యోగం దొరక్క స్థానికంగా ఓ మొబైల్ షాపు పెట్టారు. అది సరిగా నడవకపోవడంతో దాన్ని మూసేశాడు. ఆపై బెంగళూరుకెళ్లి ఫ్లిప్‌కార్ట్‌లో చిన్నపాటి ఉదోగ్యంలో చేరాడు. అంతగా సంపాదన రాలేదు. ఇటీవల సెలవు పెట్టి సొంతూరికి వచ్చాడు. కళ్లముందే అడవి నాశనం అవడం చూసిన బషీర్‌కు పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని భావించాడు. ఇందుకోసం కొత్తగా ప్రజలకు సందేశం చేరేలా ఉండాలని భావించే లడఖ్‌కు సైకిల్ యాత్ర చేయాలని భావించాడు.

ఆపై కష్టాల ప్రయాణం



సైకిల్ పై లడఖ్ వెళుతున్న బషీర్

తనకు ఎదురైన ఆర్థిక సమస్యలపై బషీర్ ద ట్రావెలర్ బ్లాగ్‌లో తన కష్టాల వీడియోలను పోస్ట్ చేయసాగాడు. వీటిని చూసిన స్థానికులకు పలమనేరు కుర్రాడు లడఖ్‌కు సైకిల్‌పై వెళుతున్నాడనే విషయం తెలిసింది. దీంతో పట్టణవాసులు కొందరు బషీర్‌కు తోచినంత మొత్తాన్ని ఫోన్ పే ద్వారా పంపించేశారు. ఆ డబ్బుతో టిఫిన్ మాత్రం చేస్తూ మధ్యాహ్నం భోజనం తినకుండా రాత్రిపూట బ్రెడ్ తింటూ రోడ్డు పక్కనున్న పెట్రోల్ బంకులో పడుకుంటూ ప్రయాణం సాగించాడు. మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, హర్యాణా, ఢిల్లీకి చేరేలోపు వర్షాలు మొదలయ్యాయి. దీంతో రాత్రిపూట బస చేయడానికి కష్టంగా మారింది. ఓ చిన్న టెంట్ కొని దాంట్లో పడుకున్నాడు. పంజాబ్ మీదుగా కశ్మీర్‌లోకి వెళ్లగానే విపరీతమైన చలి కారణంగా మరింత ఇబ్బందులు పడ్డాడు. తాను చలిలో పడుతున్న కష్టాల వీడియోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి. దీన్ని చూసిన రామ్ ద ట్రావెలర్స్ అనే బ్లాగర్ రూ.10 వేలు బషీర్‌కు పంపాడు. అక్కడి ఉష్ణోగ్రతలు పగటిపూట పది డిగ్రీలు, రాత్రుల్లో మైనస్–3గా ఉండడంతో దీంతో చలికి తట్టుకొనే దుస్తులు, స్వెటర్, గ్లౌజ్‌లు కొని ప్రయాణం మొదలు పెట్టాడు. కార్గిల్ లోయలో వందకిలోమీటర్ల మేర ఓ వైపు నది మరోవైపు కొండ ఇరుకైన దారిలో కనీసం పడుకునేందుకు చోటులేక రెండ్రోజులు నిద్రపోకుండానే ప్రయాణాన్ని సాగించాడు. ఆపై అక్కడున్న బీఎస్ఎఫ్ క్యాంపులకు వెళ్లి సైనికుల టెంట్ల వద్ద ఉంటూ వారిచ్చిన ఆహారం తింటూ ఎట్టకేలకు రూ.25 వేల ఖర్చుతో నెలరోజుల తర్వాత (జూలై 13న) శనివారం దేశంలోనే అత్యంత (18 వేల అడుగుల) ఎత్తయిన ప్రదేశం లడఖ్‌లో ఏర్పాటు చేసిన బోర్డు వద్దకు చేరుకుని యాత్రను విజయవంతంగా పూర్తి చేశాడు.



మంచు కొండపై బషీర్

సేవ్ ది ఫారెస్ట్



లడఖ్ ప్రయాణం కోసం 2వేలు పెట్టి పాత సైకిల్ ఒకటి కొన్నాడు. దానికి కొత్త టైర్లు మార్పించాడు. సైకిల్‌కు ముందు సేవ్‌ది ట్రీస్, సేవ్‌ది ఫారెస్ట్ అని బోర్డుతోపాటు, పలమనేరు టు లడఖ్ అని మరో నేమ్‌ప్లేట్ సైకిల్‌కి అమర్చాడు. పలమనేరు నుంచి జూన్ 12న బయల్దేరాడు. ఇంతదూరం ప్రయాణానికి ఏమి కావాలో కూడా పెద్దగా తెలియక తన వద్ద నున్న మూడు వేల రూపాయలతోనే బయలుదేరాడు. మదనపల్లె, అనంతపూర్ మీదుగా ఏపీని దాటి తెలంగాణా, ఆపై ఆదిలాబాద్‌దాటి మహారాష్ట్రకు వెళ్లేసరికి చేతిలో ఉన్న డబ్బులు ఖర్చయిపోయాయి.

త్వరలో సైకిల్‌పై నేపాల్‌కు ..



"రామ్ ద ట్రావెలర్ స్ఫూర్తితోనే ఈ ప్రయాణానికి బయలుదేరా. కానీ డబ్బులుండి ఇలాంటి దూర ప్రాంతాలకెళ్లచ్చునేమో. నేను రోజు భోజన ఖర్చులకు వంద రూపాయల చొప్పున మూడు వేలు నెలకు సరిపోతాయనుకున్నా. నా అంచనా తప్పింది. నేను సైకిల్‌పై వెళుతున్న విషయం మా ఇంట్లోవాళ్లకు తెలిసింది. దీంతో వారు ఇబ్బందిగా ఉంటే వెనక్కువచ్చేయమన్నారు. కానీ నాకెలాంటి ఇబ్బంది లేదని చెప్పా. నా ప్రయాణానికి పలమనేరు వాసులు బాగా సపోర్ట్ చేశారు. సరిహద్దులో మన మిలిటరీ వాళ్ల చేసిన సాయం మరువలేనిది. చెట్లను కాపాడుకోవాలన్నదే నాలక్ష్యం. తొలి ప్రయాణ అనుభవాలతో త్వరలో పలమనేరు నుంచి నేపాల్‌కు సైకిల్‌పై వెళ్లాలని అనుకుంటున్నా.

– బషీర్, పలమనేరు

ట్రాన్స్‌కో సిబ్బంది తనిఖీలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శుక్రవారం రాత్రి ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. ఇందులో మొత్తం 3,155 సర్వీసులను తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్ సర్కిల్ పరిధిలో 89, తిరుపతి రూరల్ 54, పుత్తూరు 84, చిత్తూరు అర్బన్ 70, చిత్తూరు రూరల్ 48, మదనపల్లె 67, పీలేరు 56, పుంగనూరు పరిధిలో 84 కేసులు బుక్ చేశారు. ఇందులో విద్యుత్ అదనపు లోడ్ కేసులు 497 కేసులకు గాను క్రమబద్ధీకరణ రుసుం రూ.12.29 లక్షలు, చౌర్యం కేసులు 55కు గాను రూ.38 వేల జరిమానాతో కలిపి మొత్తం 552 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ.12.63 లక్షలు జరిమానా చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ సురేంద్ర నాయుడు వివరించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఉన్న కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండాయి. క్యూ కృష్ణతేజ అతిథిగృహం వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 63,493 మంది స్వామివారిని దర్శించుకోగా 31,676 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.69 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం (ఎస్ఎస్‌డీ) టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో శ్రీవారి దర్శనం లభిస్తోంది.

జీపీఎస్ గెజిట్ రద్దు చేయాలి





మాట్లాడుతున్న ఆపస్ అధ్యక్షులు బాలాజీ, గెజిట్ ప్రతులను దగ్ధం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జీపీఎస్ (గ్యారెంటీ పెన్షన్ స్కీం) గెజిట్‌ను రద్దు చేయాలని ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు శనివారం చిత్తూరులోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు దశాబ్దం నుంచి పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు సీపీఎస్ రద్దుపై శాశ్వత పరిష్కారం చూపుతామని చంద్రబాబునాయుడు, కూటమి నేతలు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని కచ్చితంగా అమలు చేయాలని కోరారు. జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు మంజునాథ గుప్తా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థకు విఘాతం కల్పించిన జీవో 117ను రద్దు చేయాలన్నారు. 3, 4, 5 తరగతుల విలీనాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. సర్కారు బడుల్లో యాప్స్ వినియోగ బాధ్యతను ప్రత్యేక సిబ్బందికి అప్పగించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం విజయ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలకూ హెడ్ మాస్టర్, పీడీ పోస్టులు, ప్రాథమికోన్నత పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.దొరస్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయులు లేని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యావలంటీర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల గ్రాంట్స్‌ను సక్రమంగా విడుదల చేయాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు మేకల సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణ, జానకిరామ్, చెన్నకేశవ, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ గెజిట్ విడుదల దుర్మార్గం

జీపీఎస్ గెజిట్ విడుదల దుర్మార్గమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ ఆరోపించారు. ఆ సంఘం నాయకులు శనివారం డీఈఓ కార్యాలయం ఎదుట గెజిట్ పత్రాలను దహనం చేసే కార్యక్రమం నిర్వహించారు. రమణ మాట్లాడుతూ పాతపెన్షన్ విధానాన్ని అమలు చేస్తారన్న ఆకాంక్షతో ఉంటే అందుకు విరుద్ధంగా ప్రస్తుత సర్కారు వ్యవహరిస్తోందన్నారు. పాత తేదీతో జీపీఎస్ అమలు చేస్తున్నట్లుగా గెజిట్ విడుదల చేయడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. ఈ ఘటనను యూటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మణిగండన్ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులందరినీ జీపీఎస్‌లోకి తీసుకొస్తూ రాజపత్రం ఇప్పుడు విడుదల చేయడం అన్యాయమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జీపీఎస్ గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆ సంఘం జిల్లా సహాధ్యక్షులు రెహానాబేగం, జిల్లా కార్యదర్శులు రెడ్డెప్పనాయుడు, సరిత, పార్థసారథి, సురేష్, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చందనం స్వాధీనం

పుత్తూరు: అటవీశాఖ అధికారులు శనివారం ఉదయం రూ.3 లక్షలు విలువ చేసే 32 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్ట్ చేశారు. పుత్తూరు ఫారెస్ట్ రేంజర్ డి.మాధవి కథనం మేరకు, మండలంలోని నేసనూరు పంచాయతీ ద్వారకానగర్ సమీపంలో అటవీ సిబ్బంది సోదాలు నిర్వహించారు. అక్రమ రవాణా కోసం ఓ కాలువలో దాచి ఉంచిన దుంగలతో పాటు అక్కడే పొంచి ఉన్న నిందితుడ్ని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వ్యక్తి నేసనూరుకు చెందిన చెంగారెడ్డి(45)గా గుర్తించారు. మరో ఇద్దరు నిందితులు ద్వారకానగర్‌కు చెందిన కృష్ణారెడ్డి, మొగిమల్లకాలనీకి చెందిన శంకర్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. వీరిని త్వరలోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని రేంజర్ మాధవి తెలిపారు. అటవీ సిబ్బంది జరిపిన దాడుల్లో ఎఫ్ఎస్ఓ లోకేష్, ఎఫ్‌బీఓలు నాగయ్య, అఫ్జల్, కుమారస్వామి, ఏబీఓ శివరాజు, బేస్‌క్యాంప్ సిబ్బంది రవి, అజయ్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో డేటా ఎంట్రీ పోస్టుకు దరఖాస్తులు

తిరుపతి(తుడా): తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో తాత్కాలిక ప్రాతిపదికన డేటా ఎంట్రీ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ అపర్ణ బిట్ల తెలిపారు. 35 ఏళ్లలోపు వయస్సు కలిగి, ఏదైనా డిగ్రీతోపాటు పీజీడీసీఏ, డీసీఏ చదివిన అభ్యర్థులు ఆంగ్లంపై పట్టుకలిగి ఉండాలన్నారు. అలాగే డేటా ఎంట్రీలో అనుభవం ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు https://svimstpt.ap.nic.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు పొందాలని తెలిపారు.

గ్రామాలు.. మురికి కూపాలు

- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- రోడ్ల పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు
- వీధుల్లో మురుగునీటి గుంటలు
- పల్లెల్లో విస్తరిస్తున్న సీజనల్ వ్యాధులు



పుత్తూరులోని తిమ్మాపురంలో మురుగునీటి కుంట



గంగవరం మండలం కలగటూరులో పేరుకుపోయిన చెత్త

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని పంచాయతీలు అధ్వానంగా ఉన్నాయి. వర్షాకాలంలో గ్రామాలు మురికికూపాలుగా మారాయి. దీనిపై పంచాయతీ అధికారులు దృష్టి సారించడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలతో డ్రైనేజీలోని మురుగునీరు ఎక్కడికక్కడే నిల్వ చేరింది. గ్రామాల్లో కనీసం డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీటి గుంటలుగా తయారయ్యాయి. దోమల నివారణకు మందు పిచికారీ చేయలేదు.

అంతా అపరిశుభ్రత

గ్రామాల్లో అంతర్గత రోడ్లు, వీధులు చెత్తచెదారాలతో నిండిపోతున్నాయి. ఇంటింటి చెత్త సేకరణకు ప్రత్యేకంగా వాహనాలు సక్రమ నిర్వహణ లేదు. పట్టణాల మాదిరిగానే గ్రామాల్లోనూ చెత్తను సేకరించేందుకు వాహనాలు, ప్రత్యేక సిబ్బందిని పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రతిరోజు సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించడంతో గ్రామాల్లో వీధులు శుభ్రంగా గతంలో ఉండేవి. ప్రభుత్వం మారిన తర్వాత నెల దాటి నావీధులు మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి.

వ్యాధులబారిన ప్రజలు

గ్రామాల్లో సైడ్ డ్రెయిన్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో దోమల సంఖ్య పెరుగుతోంది. ఫలితంగా అంటు వ్యాధులు విజృంభిస్తున్నాయి. వాస్తవానికి వర్షాకాలంలో దోమల నివారణ మందును గ్రామాల్లో ముందస్తుగా పిచికారి చేయాలి. ఎప్పటికప్పుడు పనులను పంచాయతీ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంది. గ్రామాల్లో ఆ విధమైన పనులు వర్షాకాలం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు చేసిన దాఖలాలు లేవు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో వ్యాధులు క్రమంగా విజృంభిస్తున్నాయన్న విమర్శలున్నాయి.

పర్యవేక్షణ లోపం

వర్షాకాలంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో పై డివిజన్ పంచాయతీ అధికారి, మండల అభివృద్ధి అధికారి, ఈఓపీఆర్డీల పర్యవేక్షణ ఉండాలి. ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించాలి. కానీ గ్రామాల్లో ఆ పరిస్థితులు కన్పించడం లేదు. డివిజన్ స్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకు పర్యవేక్షణ కరువైంది. దీంతో పారిశుధ్యం పడకేసింది. దీనిపై డీపీఓ లక్ష్మిని సంప్రదించగా పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు.



యాదమరి: జ్యోతిచింతల పంచాయతీలో..



విజయపురంలో రోడ్డు పక్కనే మురుగునీరు



కార్వేటినగరం: ఆర్‌కేవీబీపేట పంచాయతీలో

పదవులు అనుభవించి విమర్శలా?

- పెద్దాయన హయాంలోనే అత్యధిక పదవులు
- ఆయన చలువతోనే ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులు ఇచ్చారు
- ఇప్పుడు పార్టీ మారి విమర్శలు చేయడం విడ్డూరం
- సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సహదేవరెడ్డి



సహదేవరెడ్డి, సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్

భాకరాపేట: పార్టీలో ఉన్నప్పుడు ఆశించిన పదవులు అనుభవించి ఇప్పుడు ఆ పార్టీపైనే విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి సామకోటి సహదేవరెడ్డి మండిపడ్డారు. శనివారం చిన్నగొట్టిగల్లులో ఆయన విలేకరులతో మాట్లాడారు. పుంగనూరు నియోజకవర్గం, పులిచెర్ల మండలానికి చెందిన జెడ్పీటీసీ మురళీధర్ వైఎస్సార్ సీపీ విధివిధానాలను తప్పుపట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హయంలోనే మురళీధర్ పులిచెర్ల మండలానికి ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులతో పాటు, పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ పదవిని అనుభవించారని గుర్తుచేశారు. ఇలాంటి వారు కూడా పార్టీని వీడడంతో పాటు తల్లిలాంటి వైఎస్సార్‌సీపీపైనే విమర్శలు చేయడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. పార్టీ నాయకులు మారినంత మాత్రాన పార్టీ కేడర్ మారదన్నారు.

ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయ సంఘాలతో నూతన ప్రభుత్వం వెంటనే సమన్వయ సమావేశం నిర్వహించి, చర్చించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నూతన ప్రభుత్వం సమన్వయ సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా నారాలోకేష్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటి వరకు సంఘం నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించకపోవడం అన్యాయమన్నారు. అసంబద్ధమైన జీవో 117ను రద్దు చేసి,ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు చిత్తశుద్ధిని చాటాలని కోరారు. రాష్ట్ర నాయకులు గంటామోహన్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ పెరిగిన ధరలు, జీవన ప్రమాణాలకు అనుగుణంగా మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని కోరారు. ఉమ్మడి సర్వీసు నిబంధనలకు అనుగుణంగా పదోన్నతుల ప్రక్రియ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, హేమచంద్రారెడ్డి, శ్రీదేవి, జగన్‌మోహన్‌రెడ్డి, బోడె మోహన్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన మహా వృక్షం

కార్వేటినగరం: మూడు వారాలుగా కురుస్తున్న వర్షాలతో మహా వృక్షం నేలకొరిగింది. సుమారు 300 ఏళ్ల నాటి రావి చెట్టు శుక్రవారం రాత్రి నిలువుగా చీలిపోయి ఆలయంపై కూలిపోయింది. మండల కేంద్రంలోని స్కంధ పుష్కరిణి సమీపంలో ఉన్న శ్రీతంగమేశ్వరస్వామి ఆలయం పక్కన ఈ రావి చెట్టు ఉంది. గత సంవత్సరం లక్షలు వెచ్చించి ఆలయ శిఖరాన్ని అధునాతనంగా తీర్చిదిద్దారు. అదే విధంగా భక్తుల కోసం రేకుల షెడ్డు కూడా నిర్మించారు. ఈ ఆలయానికి వచ్చే భక్తులు ఈ మహా వృక్షానికీ పూజలు చేసేవారు. ఇది ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నిలువుగా చీలి, ఆలయంపై కూలిపోయింది. దీంతో రేకుల షెడ్డుతోపాటు ఆలయ శిఖరం కూడా ధ్వంసమైంది.



గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఐరాల: మండలంలోని అగరంపల్లె సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కాణిపాకం పోలీసులు గుర్తించారు. మృతుడి వయసు 45 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై గళ్ల చొక్కా ధరించాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ రామ్మోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేధిస్తే నిర్భయంగా ఫిర్యాదు చేయండి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధ్యాపకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): లైంగికంగా వేధిస్తే, నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని అపోలో మెడికల్ కళాశాల ఉప కులపతి డాక్టర్ హెచ్ వినోద్ భట్, అటానమీ ప్రొఫెసర్ సుభద్రాదేవి అన్నారు. చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో యూనివర్సిటీలో శనివారం యూనివర్సిటీ అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) 'కార్యాలయ ప్రదేశాలలో లైంగిక వేధింపుల నిరోధక చర్యలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించింది. వారు విద్యార్థులకు, సిబ్బందికి విలువ ఆధారిత విద్య, నైతిక విలువల ప్రాముఖ్యతను వివరించారు. మహిళలపై లైంగిక వేధింపులు నివారణ నిషేధం, పరిహారం చట్టం 2013పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిటీ చైర్‌పర్సన్ జి.బి హిమబిందు, ప్రొఫెసర్ పోతరాజు రిజిస్టర్, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



కారులోనే మృతి చెందిన ఉపేంద్ర ఆచ్చారి

ఐరాల: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలు కాగా, మరో ఐదుగురికి స్వల్ప గాయాలైన సంఘటన మండలంలోని చిగరపల్లె సమీపంలోని తిరుపతి, బెంగళూరు హైవేపై శనివారం చోటుచేసుకుంది. కాణిపాకం ఎస్ఐ రామ్మోహన్ కథనం మేరకు, తెలంగాణ రాష్ట్రం సూర్యపేటకు చెందిన స్నేహితులు ఉపేంద్ర ఆచ్చారి, సురేష్‌గౌడ్, మధుబాబు(డ్రైవర్), కార్తీక్, ఉప్పలయ్య, మహేంధర్, గంగాధర్ వీరందరూ కలిసి కారులో శుక్రవారం సూర్యపేట నుంచి తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనార్థం బయలుదేరారు. శనివారం తిరుపతికి చేరుకున్నారు. తిరుపతికి చేరుకున్న వీరు స్వామి దర్శనానికి సమయం ఉండడంతో ఆ సమయంలో కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి బయలుదేరారు. ఈ క్రమంలో చిగరపల్లె సమీపంలోని హైవే వద్ద డ్రైవర్ మధుబాబు అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొన్నారు. అదే సమయంలో వెనుక వస్తున్న మరో లారీ కారుని ఢీకొంది. దీంతో ఉపేంద్ర ఆచ్చారి(35), అక్కడికక్కడే మృతి చెందారు. కార్తీక్ తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన ఉపేంద్ర ఆచ్చారిని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ కార్తీక్‌ను వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.